ఈ-పేపర్ తెలుగు డైలీ 8PM

# ఇయ్యాల్టి NEWS

Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

గురువారం, జూన్ 4, 2026

### కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు..

# దంచికొడుతున్న వానలు

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:** కేరళ తీరాన్ని నైరుతి రుతుపవనాలు తాకాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది ఈ క్రమంలోనే కేరళలో అన్ని ప్రాంతాలకు.. తమిళనాడులో కొన్ని ప్రాంతాలకు ఋతుపవనాలు విస్తరించాయని పేర్కొన్నారు. రాబోయే రెండు రోజుల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాలో కొన్ని ప్రాంతాలను కూడా రుతుపవనాలు తాకుతాయని వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌పై ఉపరితల ఆవర్తనం వలన రెండు తెలుగు రాష్ట్రాల్లో రాబోయే ఐదు రోజులు వర్షాలు పడతాయని పేర్కొన్నారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని.. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ట స్థాయి ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని వెల్లడించారు.. కాగా తెలంగాణలోని కామారెడ్డి జిల్లాలో కూడా ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కామారెడ్డిలో పట్టణంలో వర్షం దంచికొట్టడంతో పలు కాలనీలు జలమయమయ్యాయి.



దోమకొండ, బీబీపేట, మాచారెడ్డి, బిక్కనూరు, జుక్కల్ మండలాల్లో కూడా వర్షం కురిసింది. నేడు, రేపు పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉంది..







ఈ–పేపర్ తెలుగు డైలీ 8PM

ఇయ్యాల్టి NEWS Local 2 GlobaL

https://epaper.eyyaltynews.in/

గురువారం, జూన్ 4, 2026

# సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 4:** హిమాయత్ నగర్ డివిజన్ చెందిన సాయి బాబు ఇటీవల అనారోగ్యం భారిన పడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అతనికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కును డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ అందజేశారు .

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జానపద, శేఖర్, రాజేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి ..కాళ్రేవుపల్లి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన 3



జంతువులతో మాట్లాడే రోజులు వచ్చేస్తున్నాయి.. సైన్స్ ఫిక్షన్‌ను నిజం చేస్తున్న ఏఐ! 3



నిరుద్యోగులకు మరో గుడ్ న్యూస్.. టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్ విడుదల 3



వీధి కుక్క కోసం 'డిజిటల్' యుద్ధం... బ్రెజిల్ వర్సెస్ మెక్సికో 4

# ఇక చేతికి పైసలియ్యరు..!

## పెన్షన్ దారులకు రేవంత్ సర్కార్ గట్టి అలర్ట్.. ఆగస్టు సంది కొత్త ముచ్చట..!



**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 4:** పెన్షన్ తీసుకునే ముసలోళ్లకు, అవ్వలకు, ఐనవోళ్లకు రేవంత్ సర్కార్ ఒక పెద్ద అలర్ట్ పంపింది. ఇక సంది ఊర్లల్ల పంచాయతీ సెక్రటరీలు, బిల్ కలెక్టర్లు చేతి పైసలు పెట్టే ముచ్చట బంద్ కాబోతుంది. అంతా 'ఆన్‌లైన్' కథే! ఎండల నిలబడి, పోస్టాఫీసుల చుట్టూ తిరిగి సచ్చే తిప్పలు తప్పాలె అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టి నిర్ణయం తీసుకున్నాడు. ఇకపై పెన్షన్ పైసలన్నీ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే 'టకా టకా' జమ అవుతుంది.

### అసలేమైందంటే..?

మన రాష్ట్రంలో ముసలోళ్లు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు.. ఇట్లా అందరూ కలిసి దాదాపు 42 లక్షల మంది 'చేయూత' పెన్షన్లు తీసుకున్నారు. అయితే, సగం మందికి బ్యాంకుల్ల పడుతుంటే, మిగతా సగం మందికి మాత్రం చేతికో, పోస్టాఫీసులనో ఇస్తుండ్రు.కానీ, ఈ చేతికిచ్చే పైసల్ల బాగా గోల్‌మాల్ జరుగుతుందని, లేనోళ్లకు.. బోగస్ గాళ్లకు పైసలు పోతున్నాయని సర్కార్ దృష్టికి వచ్చింది.

పైగా ముసలి ప్రాణాలు పెన్షన్ పైసల కోసం ఎండల గంటల తరబడి లైన్లలో నిలబడి ఆగమాగం అవుతుండ్రు. అందుకే సీఎం రేవంత్ రెడ్డి "ఈ లొల్లి ఇక వద్దు.. అంతా పారదర్శకంగా ఉండాలే" అని ఆఫీసర్లకు ఆర్డర్ వేశారు.

### కొత్త రూల్ ఏంది? ఎప్పటి సంది వస్తుంది?

ఇప్పటిదాకా చేతికి పైసలు తీసుకునేటోళ్లందరికీ 'ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్' లానో, లేకపోతే వేరే బ్యాంకుల్లోనో కొత్త ఖాతాలు తెరిపిస్తారు. లైవ్ అథెంటికేషన్: అసలు పెన్షన్ తీసుకునేటోళ్లు ఉన్నారా? లేరా? అని ఆఫీసర్లు ఊర్లల్లో తిరిగి 'లైవ్ అథెంటికేషన్' (బతికే ఉన్నారా లేదా అని చూస్తే ముచ్చట) చేస్తున్నారు.

ఈ తనిఖీలన్నీ జూన్ ఆఖరు కల్లా ముగిసిపోవాలె. జూలై అంతా డేటా రెడీ చేస్తారు.ఆగస్టు సంది అకౌంట్లలోకే: అంతా ఆగస్టు నెల సంది అమల్లోకి వస్తుంది. సీఎం ఒక్క క్లిక్ కొడితే చాలు.. పైసలన్నీ ఎవరి అకౌంట్‌లనో వాళ్లకే పడతాయి. పైసలు అకౌంట్ల పడ్డాక.. మీకు నచ్చినప్పుడు, మెల్లగా బ్యాంకుకో, పోస్టాఫీసుకో పోయి విత్ డ్రా చేసుకోవచ్చు. లేదంటే ఏటీఎంలనైనా పైసలు డ్రా చేసుకోవచ్చు. పైసల దొంగతనం జరగదు..

బోగస్ గాళ్ల ఆటలు సాగవు! నిజమైన పేదోళ్లకు టైంకు పైసలందుతయ్.



# వచ్చే ఆదివారం ఉప్పల్ భగయత్‌ల వంజరి ఆత్మగౌరవ భవనం ప్రారంభం

### చీఫ్ గెస్ట్‌గా రావాలని సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే కాలేరు ఇన్విటేషన్

### "నువ్వు చెప్పినంక రానా అన్నా!"తప్పకుండా వస్తా!"..అంటూ సీఎం చమత్కారం

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 4:** ఉప్పల్ భగాయత్‌ల వంజరి కులబాంధవుల ఆత్మగౌరవ భవనం ఓపెనింగ్‌కు సర్వం సిద్ధమైంది. ఎప్పుడెప్పుడా అని ఆ శుభ ముహూర్తం రానే వచ్చేసింది.

వచ్చే ఆదివారం 7వ తేదీ పొద్దుగాల 10 గంటల 11 నిమిషాలకు రిబ్బన్ కట్ చేయడానికి టైం ఫిక్స్ చేసింద్రు.ఈ పెద్ద ముచ్చటకు చీఫ్ గెస్ట్‌గా రావాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, వంజరి సంఘం ప్రతినిధులు కాలేరు నరేందర్, కందారి వెంకటేశ్, కాలేరు అమరేందర్, బానుక ఆంజనేయులు అందరూ కలిసి ప్రగతి భవన్లో సీఎం రేవంత్ రెడ్డికి ఇన్విటేషన్ కార్డు ఇచ్చారు. కార్డు చేతికి తీసుకోగానే రేవంతన్న తన స్టైల్ లో నవ్వుతూ.. "నువ్వు చెప్పినంక రానా అన్నా.. తప్పకుండా వస్తా!" అంటూ మస్త్ చమత్కరించిండు.

దాంతో అక్కడ ఉన్న లీడర్లందరి మొహాల్లో నవ్వులు పూశాయి, జోష్ పెరిగింది!.. వంజరి సంఘం నాయకులు కేవలం బొట్టు పెట్టి పిలిచి, షేక్‌హ్యాండ్ ఇచ్చి ఊరుకోరుకదా... వంజరి కులం జనాలు గిప్పుడు ఎదుర్కొంటున్న తిప్పలు ఏంటి? వాళ్లకు కావాల్సిన సాయం ఏంది? అనే అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ముందు పూసగుచ్చినట్టు పెట్టింద్రు.ఇక మొత్తానికైతే ఒకపక్క 9 కోట్ల భారీ ఖర్చుతో కట్టిన అద్భుత భవనం ఓపెనింగ్ సంబరం.. ఇంకోపక్క రేవంత్ రెడ్డి వస్తానన్న గ్యారెంటీ.. వెరసి వంజరి అన్నల ఆత్మగౌరవ పండుగ ఆదివారం వచ్చే ఉప్పల్ భగాయత్‌ల గట్టిగానే జరిగేటట్టు ఉంది..

# పాలమూరు పర్యటనలో రేవంత్ రెడ్డి..

## కాళ్రేవుపల్లి ఎత్తిపోతల పథకం పనుల పరిశీలన

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:** పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల పరిశీలనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట-కొడంగల్, పాలమూరు-రంగారెడ్డితో పాటు పెండింగ్ ప్రాజెక్టుల పనులను క్షేత్రస్థాయిలో పరిశీస్తున్నారు. సాయంత్రం కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సీఎం బస చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించనున్నారు. రేపు పీఆర్ఎల్ఐ ప్రాజెక్టులోని ప్యాకేజీలను పరిశీలించుకుంటూ వచ్చిన అనంతరం జడ్చర్లలో భారీ బహిరంగ సభలో పాల్గోనున్నారు.బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ : ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పనులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించేందుకు సీఎం రేవంత్ పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇవాళ, రేపు మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లను పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం నారాయణ పేట జిల్లా మక్తల్ కు హెలికాప్టర్ ద్వారా చేరుకున్న సీఎం కొడంగల్ - నారాయణపేట ప్రాజెక్టుపై



అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా, భీమా నదులపై ప్రతిపాదిత బ్రిడ్జి కమ్ బ్యారేజీలు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. పాలమూరు ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా ముఖ్యమంత్రి, మంత్రులు కాట్రావుపల్లిలో ఎత్తిపోతల పథకం, ప్రతిపాదిత బ్యారేజీలపై ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ వీక్షించారు. సీఎంతో పాటు కర్ణాటక మాజీ మంత్రి బోసురాజు కూడా మక్తల్ చేరుకున్నారు.



# హరీశన్నకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన దూసరి

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 4:** మాజీ మంత్రి హరీశ్ రావు పుట్టిన రోజు సందర్భంగా మెమొంటోను అంద చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్న అంబర్ పేట నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నేత దూసరి శ్రీనివాస్ గౌడ్



# ఆవిర్భావ దినోత్స వేడుకల పరేడ్‌లో ప్రగతి స్కూల్ స్కౌట్ విద్యార్థులకు బహుమతి

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 4:** తెలంగాణ ఆవిర్భావ దినోత్సం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన పరేడ్ లో అంబర్ పేట బాపునగర్ ప్రగతి విద్యానికేతన్‌కు చెందిన స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనపరిచి బహుమతి గెలుచుకున్నారు

# ఈగల్ టీమ్ కీలక ఆపరేషన్


## - రూ.12కోట్ల విలువైన గంజాయి స్వాధీనం

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** హైదరాబాద్‌లో అంతర్జాతీయ హైడ్రోఫోనిక్ గంజాయి ముఠా గుట్టురట్టయింది. థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు పెద్దఎత్తున గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. థాయిలాండ్ నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో దిగిన అంతర్జాతీయ స్మగ్లింగ్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.12 కోట్ల విలువైన హైడ్రోఫోనిక్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు హేమంగ్ అలియాస్ కేలుస్కర్ సహా 10 మంది పెడ్లర్లను ఈగల్ ఫోర్స్ అరెస్ట్ చేసింది. పట్టుబడ్డ డ్రగ్స్ ముంబయికి తరలించేందుకు నిందితులు ప్రణాళిక వేసుకున్నట్లు ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన సుధాంశ్‌కు ముంబయి మాఫియాతో సంబంధాలు ఉన్నట్లు వెల్లడించారు.



# భూముల విలువ పెంపు.. రిజిస్ట్రేషన్ ఆఫీసులకు పోటెత్తిన జనం

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్ పేట, జూన్ 4:** తెలంగాణలో భూముల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయనే వార్తల నేపథ్యంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పాత ధరలకే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు గురువారం ఉదయం నుంచే ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రోజు రాత్రి 7:30 గంటల వరకు పనివేళలను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం ద్వారా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది రేపటి నుంచి అమలులోకి వస్తుండటంతో, పెరిగే ఛార్జీల భారం నుంచి



తప్పించుకునేందుకు కొనుగోలుదారులు కార్యాలయాల వద్ద బారులు తీరారు.ప్రజల రద్దీ, విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రెవెన్యూ శాఖ, ప్రత్యేకంగా గురువారం పనివేళలను పొడిగించింది. టోకెన్లు తీసుకున్న వారందరి రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ప్రభుత్వం పనివేళలు పొడిగించి సౌలభ్యం కల్పించినా, భారీ సంఖ్యలో జనం రావడంతో వ్యవస్థపై ఒత్తిడి నెలకొంది.

# ప్రగతి భవన్‌ను బాంబులతో పేల్చేస్తామని రేవంత్ రెడ్డి అనలేదా? కేటీఆర్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** అసలు విషయాన్ని బయటకు రాకుండా విషయాన్ని పక్కదారి పట్టించడానికే బాల్క సుమన్?ను అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సింగరేణిలో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును లేనిది ఉన్నట్లుగా రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇంత కుంభకోణం జరుగుతుంటే ముఖ్యమంత్రి గమ్మున ఎందుకు ఉన్నారని దీనిపై నేను కిషన్ రెడ్డికి లేఖ రాస్తానన్నారు. చంచల్ గూడ జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్?ను ఇవాళ ములాఖత్ అయిన కేటీఆర్ అనంతరం మీడియాతో



మాట్లాడుతూ గతంలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్ రెడ్డి ప్రగతి భవన్ ను బాంబులతో పేల్చినా తప్పులేదని మాట్లాడారని, పాతబస్తీపై సర్జికల్ స్ట్రైక్ చేస్తామని బండి సంజయ్, హరీశ్ రావుపై పెట్రోల్ పోసి తగలబెడతామని మైనంపల్లి మాట్లాడారన్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకోని ప్రభుత్వానికి కేవలం బాల్క సుమన్ పై ఎందుకింత కోపం అని ప్రశ్నించారు. కార్మికుల ఆవేశాన్నే బాల్క సుమన్ మాట్లాడారన్నారు.

# ఫ్లాట్‌గా ముగిసిన స్టాక్ మార్కెట్లు



**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశం నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి నిఫ్టీ 10.95 పాయింట్లు లాభపడి 23,416.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ కూడా కేవలం 13.84 పాయింట్ల స్వల్ప లాభంతో 74,360.01 వద్ద ముగిసింది. రేపు (శుక్రవారం) ఆర్బీఐ పాలసీ నిర్ణయాలు వెలువడనున్న తరుణంలో, ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. టెక్నికల్ పరంగా, నిఫ్టీకి 23,500 స్థాయి కీలక నిర్ణయాత్మక జోన్‌గా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ స్థాయిని దాటితే మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడి 23,600, ఆ తర్వాత 23,800 వైపు పయనించవచ్చని అంచనా వేస్తున్నారు. మరోవైపు, 23,300-23,350 వద్ద తక్షణ మద్దతు లభిస్తుండగా, 23,150-23,200 వద్ద బలమైన కొనుగోళ్ల ఆసక్తి కనిపిస్తోందని తెలిపారు.



# నిరుద్యోగులకు మరో గుడ్ న్యూస్..

## టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్ విడుదల

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ రాష్ట్రంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 49 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టులను భర్తీ చేయనుంది. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో జూన్ 8, 2026వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) - ఆర్‌డబీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే సంబంధిత విభాగంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ (బీటెక్)లో ఉత్తీర్ణత పొంది ఉండాలి. లేదా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ అసోసియేట్ మెంబర్‌గా ఉండాలి. అభ్యర్థుల వయోపరిమితి 2026 జులై 1వ తేదీ నాటికి 18 నుంచి 44 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో జులై 15, 2026వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు రుసుము కింద ఓసీ, బీసీ అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు రూ. 1000, ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.500 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది. దీనితోపాటు అదనంగా పరీక్ష రుసుము రూ.120 ప్రతి ఒక్కరూ చెల్లించాలి. అయితే నిరుద్యోగులకు పరీక్ష రుసుము రూ.120 నుంచి మినహాయింపు ఉంటుంది. అంటే వీరు చెల్లిచవల్సిన అవసరం లేదు. ఆబ్జెక్టివ్ టైప్ రాత పరీక్ష ఆధారంగా తుది ఎంపిక ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 వరకు జీతంగా చెల్లిస్తారు.



# రాహుల్ 'ఆర్థిక సునామీ' వ్యాఖ్యలు..

## భయాన్ని సృష్టించవద్దని బీజేపీ హెచ్చరిక

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:**
దేశంలో త్వరలో 'ఆర్థిక సునామీ' రాబోతోందని, ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పరిస్థితులను ప్రకటించవచ్చని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండించింది. ఇవి కేవలం ప్రజల్లో భయాన్ని సృష్టించే ప్రయత్నాలని, భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచ సవాళ్లను తట్టుకుని పటిష్ఠంగా ఉందని స్పష్టం చేసింది. బుధవారం కాంగ్రెస్ గిరిజన విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశంలో ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం తప్పదని హెచ్చరించారు. గతంలో ఆర్థిక ఒత్తిళ్ల నుంచి దేశాన్ని కాపాడిన వ్యవస్థలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను అణచివేసేందుకు ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించే అవకాశం ఉందని కూడా ఆయన వ్యాఖ్యానించారు.



# మమతకు భారీ షాక్

## బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:**
పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు.



# జంతువులతో మాట్లాడే రోజులు వచ్చేస్తున్నాయి..

## సైన్స్ ఫిక్షన్‌ను నిజం చేస్తున్న ఏఐ!

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:**
మనం తిమింగలంతో మాట్లాడగలిగితే ఎలా ఉంటుంది? పక్షి ఏం చెబుతుందో మనకు అర్థమైతే ఎలా ఉంటుంది? ఇప్పటివరకు కేవలం హాలీవుడ్ సినిమాల్లో మాత్రమే చూసిన ఇలాంటి వింతలు.. త్వరలోనే నిజం కాబోతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత సాయంతో జంతువుల, పక్షుల భాషను డీకోడ్ చేయడానికి శాస్త్రవేత్తలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. చాట్‌జీపీటీ వెనుక ఉన్న సాంకేతికతను వాడుతూ మూగజీవాల నోటి నుంచి వచ్చే శబ్దాల వెనుక ఉన్న అసలు అర్థాలను కనిపెడుతున్నారు.ఇటీవలి కాలంలో ఎలుకలు, డాల్ఫిన్లు, కోతులు, పక్షులు, తిమింగలాలు, కటిల్‌ఫిష్ వంటి జీవులపై జరిగిన పరిశోధనల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జంతువుల సమూహాల్లో ఒకదానికొకటి చేసుకునే విభిన్న శబ్దాలు, వాటి వెనుక ఉన్న ప్రత్యేక అర్థాలను గుర్తించడంలో ఏఐ సిస్టమ్స్ శాస్త్రవేత్తలకు సహాయపడుతున్నాయి. ఉదాహరణకు ఆఫ్రికన్ చారల ఎలుకలపై చేసిన పరిశోధనలో ఏకంగా 1.22 లక్షల కంటే ఎక్కువ శబ్దాలను విశ్లేషించి వాటిలో వేర్వేరు రకాల పిలుపులను ఏఐ గుర్తించింది.

# సూడాన్ నుంచి హైదరాబాద్ వచ్చిన వ్యక్తికి ఎబోలా లక్షణాలు.!.. గాంధీ ఆస్పత్రికి తరలింపు..

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** సూడాన్ నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఓ వ్యక్తికి ఎబోలా వైరల్ హిస్టరీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. స్ర్కీనింగ్ పరీక్షల్లో ఈ విషయం తేలటంతో వెంటనే అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి ఐసోలేషన్ కేంద్రంలో ఉంచారు. అతని నుంచి నమూనాలను సేకరించి.. సీసీఎంబీకి పరీక్షల కోసం పంపించారు. ఫలితాలు ఏమొస్తాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రాజధాని హైదరాబాద్‌లో ఎబోలా కలకలం రేగింది. శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ప్రయాణికుడికి ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సూడాన్ దేశం నుంచి మహ్మద్ అనే వ్యక్తి గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్టు చేరుకున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు విమానాశ్రయంలో అధికారులు ఆఫ్రికా దేశాల నుంచి వచ్చేవారికి స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే సూడాన్ నుంచి వచ్చిన మహ్మద్‌కు పరీక్షలు నిర్వహించగా.. ఎబోలా వైరస్ హిస్టరీ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన వైద్య సిబ్బంది.. అతన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసోలేషన్ కేంద్రంలో ఉంచి పరీక్షిస్తున్నారు. అతని నుంచి నమూనాలను సేకరించిన గాంధీ ఆస్పత్రి సిబ్బంది.. పరీక్షలో కోసం ఆ శాంపిల్లను సీసీఎంబీకి పంపించారు. ఫలితాలు వచ్చేంత వరకూ ఈ విషయంపై ఆస్పత్రి వర్గాలలో టెన్షన్ నెలకొంది.





## ప్రపంచస్థాయి ప్రమాణాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్..

# ఎయిర్‌పోర్టును తలపించేలా ముస్తాబు

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** ప్రయాణికులకు ఆకర్షణీయమైన, సకల సౌకర్యాలతో కూడిన ప్రయాణ అనుభూతిని అందించేందుకు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రపంచస్థాయి ప్రమాణాలతో రెడీ అవుతోంది. దక్షిణ మధ్య రైల్వే అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పునరాభివృద్ధి పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. ఈ మెగా ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పురోగతి ఫోటోలు, వివరాలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి బుధవారం ఎక్స్ వేదికగా పంచుకున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కేవలం ఒక రవాణా కేంద్రంగానే కాకుండా.. భవిష్యత్ అవసరాలను తీర్చే ఒక భారీ అంతర్జాతీయ హబ్‌గా మారుతోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ ఆధునిక రైల్వే గేట్‌వే తెలంగాణ ప్రగతికి ప్రతిరూపమన్నారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పంలో భాగమే ఈ సికింద్రాబాద్ స్టేషన్ మేకోవర్ అని చెప్పారు. స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును మొత్తం రూ.714.73 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. రాత్రింబవళ్లు జరుగుతున్న ఈ పనులు ప్రస్తుతం 64 శాతానికి పైగా పూర్తయ్యాయని చెప్పారు. ప్రయాణికుల రాకపోకలకు వీలుగా విశాలమైన ప్రవేశ ద్వారాలు, సరికొత్త వెయిటింగ్ హాళ్లు రూపుదిద్దుకున్నాయి. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎయిర్‌పోర్టు తరహా అనుభూతిని ఇచ్చేలా అత్యాధునిక ఎయిర్‌కాన్‌కోర్స్ నిర్మాణం చివరి దశకు చేరుకుంది.

## అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం..

# స్తంభించిన ట్రాఫిక్

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** నిత్యం రద్దీగా ఉండే హైదరాబాద్ అమీర్‌పేటలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మైత్రివనం దగ్గర్లోని కేఎస్ఆర్ షాపింగ్ మాల్‌లో మంటలు చెలరేగాయి. తొలుత ఓ ఆటబొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ మొత్తం వ్యాపించాయి. పెద్ద ఎత్తున ప్లాస్టిక్ వస్తువులు ఉండడంతో మంటలు వేగంగా అంటుకున్నాయి. మైత్రివనం ప్రాంతంలో అనేక ఆఫీసులు, కోచింగ్ సెంటర్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు ఉంటాయనే విషయం తెలిసిందే.మంటల ధాటికి ఆ ప్రాంతమంతా పెద్ద ఎత్తున పొగ అలముకుంది. రోడ్డు కనపడనంత తీవ్రంగా పొగ కమ్మేయడంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నాయి.




నాలుగు ఫైరింజన్లు మంటలను ఆర్పుతున్నాయి. మరోవైపు పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించే ప్రయత్నం చేశారు. . మంటలు చెలరేగిన వెంటనే షాపింగ్ కాంప్లెక్స్‌లోని వారంతా బయటకు పరిగెత్తుకొచ్చారు. దీంతో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ప్రాథమికంగా పోలీసులు తేల్చారు. కానీ, చాలా దుకాణాలు దగ్ధం అవడంతో ఆస్తి నష్టం మాత్రం భారీగా ఉండే అవకాశం ఉంది. అలాగే షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. మరోవైపు సమీపంలోనే మెట్రో స్టేషన్‌లో కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం లేదని అధికారులు తెలిపారు. సర్వీసులు యథావిధిగా కొనసాగుతున్నట్లు చెప్పారు.



# శత్రువుల కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి..


## ఇరానీయులకు మొజ్తబా ఖమేనీ సందేశం

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ఇరానీయులకు సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ కీలక సందేశం పంపించారు. శత్రువుల కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని జాతీయ ఐక్యతే తమ బలంగా పేర్కొన్నారు. యుద్ధరంగంలో ఓటమి చెందిన శత్రువులు ఇప్పుడు ప్రజల్లో నిరాశ, విభేదాలను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.గురువారం విడుదల చేసిన సందేశంలో ఖమేనీ మాట్లాడుతూ.. "యుద్ధభూమిలో తమ లక్ష్యాలను సాధించలేకపోయిన శత్రువులు ఇప్పుడు మానసిక యుద్ధానికి దిగారు. ప్రజల ధైర్యసాహసాలను దెబ్బతీయడం, దేశంలో అంతర్గత విభేదాలు సృష్టించడం వారి ప్రధాన లక్ష్యం" అని పేర్కొన్నారు. ప్రజల్లో నిరాశ, నిస్పృహను పెంచే లేదా దేశ భవిష్యత్తుపై ప్రతికూల భావనలు కలిగించే ఏ చర్యైనా శత్రువులకు సహకరించినట్టేనని హెచ్చరించారు. దేశ ప్రయోజనాల కోసం ప్రజలందరూ ఒకే తాటిపై నిలవాలని సూచించారు. ఇక ఇజ్రాయెల్‌ను కేన్సర్ కణితితో పోల్చారు. జియోనిస్ట్ పాలన ఎంతో కాలం మనుగడ సాధించదని పేర్కొన్నారు.

# సురేష్ గౌడ్ దంపతులకు పెండ్లి రోజు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే కాలేరు

**ఇయ్యాల్టి న్యూస్, అంబర్‌పేట, జూన్ 4:** గోల్నాక డివిజన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు, మారుతీనగర్ అధ్యక్షుడు సురేష్ గౌడ్ పెండ్లి రోజు సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ను మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా సురేష్ గౌడ్ దంపుతును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.







# విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

**ఇయ్యాల్టి న్యూస్, హైదరాబాద్, జూన్ 4:** హైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-II(ఫారం-సి) సమర్పించాలి. విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-IIలో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి.2ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

ఇయ్యాల్టి NEWS
Local 2 GlobaL
https://epaper.eyyaltynews.in/

## జైలుకు వెళ్లడమే వీడి హాబీ!..సెంట్రల్ జైలు కోసం ఏకంగా భార్యనే..!



**ఇయ్యాల్టి న్యూస్, జూన్ 4:** ప్రపంచంలో ఒక్కొక్కరికి ఒక్కో రకమైన అలవాటు ఉంటుంది. కానీ ఉత్తరప్రదేశ్‌లోని ఎటావాకు చెందిన ఒక యువకుడికి మాత్రం ఏకంగా 'జైలుకు వెళ్లడం' హాబీగా మారింది. ఈ వింత కోరిక కోసం అతను చేసిన పని ఇప్పుడు సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది.ఎటావాకు చెందిన కోమల్ సింగ్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు ఎలాగైనా 'సెంట్రల్ జైలు'ను లోపలి నుండి చూడాలనే వింత కోరిక కలిగింది. జైలుకు వెళ్లడానికి పెద్ద నేరం చేయాలి కాబట్టి, అతను ఏకంగా తన భార్య ఛాతీపై పిస్టల్ గురిపెట్టి బెదిరించాడు. ఇంతకుముందే మూడుసార్లు: తాను ఇంతకుముందే మూడుసార్లు ఒరాయ్ జైలుకు వెళ్లొచ్చానని, ఆ జైలుకు వెళ్లడం తనకు అలవాటేనని కోమల్ సింగ్ తెలిపాడు. కానీ ఈసారి పెద్ద జైలైన 'సెంట్రల్ జైలు'ను చూడాలంటే పట్టుదలతోనే ఈ ఘాతుకానికి ఒడిగట్టానని పోలీసుల ముందే ఒప్పుకున్నాడు.భార్యపై ప్రేమ ఉంది కానీ..: తన భార్యతో పెద్ద గొడవలేమీ లేవని, ఆమె అంటే తనకు ఇష్టమేనని చెప్పాడు. పెళ్లై చాలా కాలమైనా పిల్లలు లేకపోవడం వల్లే ఇంట్లో చిన్నచిన్న గొడవలు జరుగుతుంటాయని అన్నాడు. భార్యను బెదిరించిన తర్వాత కోమల్ సింగ్ స్వయంగా నడుచుకుంటూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు.

తాను నేరానికి ఉపయోగించిన పిస్టల్, మందుగుండు సామగ్రిని పోలీసులకు అప్పగించాడు.పోలీసులు రికార్డ్ చేసిన వీడియోలో అతను ఎలాంటి భయం, పశ్చాత్తాపం లేకుండా నవ్వుతూ, కెమెరా వైపు చేతులు ఊపడం చూసి నెటిజన్లు ముక్కున వేలేసుకుంటున్నారు. అతని వింత ప్రవర్తన చూసి అతని మానసిక స్థితిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



## లాంగ్ ఫ్రాక్‌లో పూజ పాప పరువాలు..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4:** బాలీవుడ్, తమిళ్‌లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న పూజాహెగ్డే తాజాగా లాంగ్ ఫ్రాక్‌లో తన పరువాలతో అలరిస్తుంది.





## టైట్ డ్రెస్‌లో గ్లామర్ షో..

### ఆకట్టుకుంటున్న పాపం ప్రతాప్ బ్యూటీ

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4:**
పాయల్ రాధాకృష్ణ మోడలింగ్ రంగం నుంచి సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఈమె 2021లో విడుదలైన 'సింగపెన్నె' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది. అదే ఏడాది 'తరగతి గది ధాటి' అనే వెబ్ సిరీస్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైంది. అనంతరం పలు తెలుగు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.
తాజాగా ఈ నటి 'పాపం ప్రతాప్' సినిమాతో ప్రేక్షకులను పలకరించింది. మంచి అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద యావరేజ్ విజయాన్ని అందుకుంది.అయితే ఈ మూవీ ద్వారా పాయల్‌కు తెలుగులో మంచి గుర్తింపు లభించింది. సినిమాల్లో తన అందం, అభినయంతో ఆకట్టుకుంటున్న ఈ భామ సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉంటూ అభిమానులను అలరిస్తోంది.

## అవకాశాలు నిల్లు.. బోల్డ్ షో ఫుల్లు..

### బటన్స్ తీసేసి ప్రగ్యా జైస్వాల్ రచ్చ

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4:**
ప్రస్తుతం చేతిలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో, ప్రగ్యా జైస్వాల్ తన పూర్తి ఫోకస్‌ను సోషల్ మీడియాపై పెట్టింది. ఇన్‌స్టాగ్రామ్‌లో నిత్యం హాట్ అండ్ బోల్డ్ ఫోటోలను షేర్ చేస్తూ నెటిజన్లకు అస్సలు నిద్ర లేకుండా చేస్తోంది.



## నా మనసంతా 'పెద్ది' దగ్గరే..

### తండ్రిగా మాత్రమే కాదు.. మెగాస్టార్ ట్వీట్ వైరల్..

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4:**
రామ్ చరణ్ ఎంతగానో కష్టపడి తన బాడీని మూడు ఆటలకు తగ్గట్టు మార్చుకొని కష్టపడి చేసిన పెద్ది సినిమా నేడు థియేటర్స్‌లో రిలీజయింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన ఈ సినిమాకు పాజిటివ్ టాక్ వస్తుంది.



పలువురు సెలబ్రిటీలు కూడా పెద్ది సినిమా బాగుందంటూ అభినందనలు తెలుపుతున్నారు. తాజాగా మెగాస్టార్ చిరంజీవి పెద్ది సినిమాపై ట్వీట్ వేశారు.ప్రస్తుతం చిరంజీవి బాబీ దర్శకత్వంలో జరుగుతున్న సినిమా షూటింగ్ లో ఉన్నారు. ముందు నుంచి చిరుకి పెద్ది సినిమాపై అంచనాలు ఉన్నాయి. కొడుకు కష్టం చూసి చిరంజీవి కూడా ఆశ్చర్యపోయాడు. పెద్ది సినిమాకు వస్తున్న పాజిటివ్ టాక్ చూసి చిరు మూవీ టీమ్ అందరికి అభినందనలు తెలియచేస్తూ ట్వీట్ చేసారు.

చరణ్ 'పెద్ది'మూవీ రివ్యూ..

## బాక్సాఫీసు వద్ద మెగా విధ్వంసం!

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4:**
గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో వచ్చిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'పెద్ది' బాక్సాఫీసు వద్ద రికార్డులు తిరగరాస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రానికి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇక ఇందులో జగపతి బాబు, దివ్యేందు శర్మ, శివరాజ్ కుమార్ కీలక పాత్రలో నటించగా.. జూన్ 4న భారీ అంచనాల మధ్య విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌తో దూసుకుపోతుంది. ఇక ఇందులో పెద్ది పాత్రలో చరణ్ వన్ మ్యాన్ షో చేశారని చెప్పాలి. రెండు, మూడు భిన్నమైన షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో ఒదిగిపోయి నటించి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు పొందుతున్నారు. ముఖ్యంగా కుస్తీ వీరుడిగా కనిపించేందుకు ఆయన బాడీని మార్చుకున్న తీరు, పడిన కష్టం చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు. స్క్రీన్‌పై ఆయన్ని చూసిన వారంతా వావ్ సూపర్ అంటున్నారు. ఇక జాన్వీ విషయానికొస్తే.. గ్లామర్‌తో సినిమాకు స్పెషల్ అట్రాక్షన్‌ను తెచ్చింది. ముఖ్యంగా 'చికిరి' పాటలో ఆమె అందం, అదిరిపోయే స్టెప్పులు థియేటర్లలో ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తాయి. జగపతి బాబు 'అప్పలసూరి' పాత్రలో మరోసారి తన విలక్షణ నటనను చూపించగా, గౌర్‌నాయుడు పాత్ర అద్భుతంగా ఉంది. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ తనదైన హుందాతనంతో మెప్పించారు. దర్శకుడు బుచ్చిబాబు సనా ఎంచుకున్న నేటివిటీ బ్యాక్‌డ్రాప్, స్పోర్ట్స్ డ్రామా ఎలిమెంట్స్ ఈ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఫస్టాఫ్‌లో క్రికెట్ హంగామాతో కథ సరదాగా సాగిపోగా.. సెకండాఫ్‌లోకి వచ్చేసరికి ఎమోషనల్ కుస్తీ పోరాటంగా మారి సినిమా పీక్స్‌కు వెళ్తుంది. ఏఆర్ రెహమాన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.




కథ విషయాని కొస్తే.. విజయనగరం జిల్లాలోని కొండ కింద గ్రామం చుట్టూ తిరిగే కథ. ఇక అక్కడ వందల మంది జీవిస్తున్నా.. ప్రభుత్వ రికార్డుల్లో ఈ ఊరికి చోటుండదు. దాంతో అక్కడి ప్రజలను అందరూ చిన్నచూపు చూస్తుంటారు.

అదే ఊరిలో పుట్టి, రోజూ టౌన్‌కు వెళ్లి కూలి పనులు చేసుకునే యువకుడే పెద్దిగా రామ్ చరణ్ కనిపించారు. పేరుకి కూలి అయినా, క్రికెట్‌లో మాత్రం అతనొక రాటు దేలిన ఆటగాడు. ఆరు బంతుల్లో ఆరు సిక్సర్లు కొట్టగల అతని టాలెంట్ చూసి బొబ్బిలి, విజయనగరం జట్లు వేలంలో పోటీ పడుతుంటాయి. అలాంటి అద్భుతమైన క్రికెటర్, అసలు ఆ ఆటను వదిలేసి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సి వచ్చింది? తన కొండ కింద గ్రామం ఉనికి కోసం, అక్కడి మనుషుల ఆత్మగౌరవం కోసం పెద్ది ఎలాంటి పోరాటం చేశాడు? ఈ ప్రయాణంలో అతను ఏం కోల్పోయాడు, ఏం సాధించాడు? అప్పలసూరి, గౌర్‌నాయుడు పాత్రలు పెద్ది జీవితాన్ని ఎలా ప్రభావితం చేశాయి? అచ్చియమ్మ పాత్ర వల్ల అతని లైఫ్‌లో వచ్చిన మలుపులు ఏంటి? అనేదే 'పెద్ది' సినిమా కథ. మొత్తానికి ఈ మూవీ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు బ్లాక్ బస్టర్ హిట్ టాక్‌ను రాబట్టుకుంటూ.. భారీ కలెక్షన్లతో బాక్సాఫీసు రికార్డులను కొల్లగొడుతోంది.

## పైట పక్కకు జరిపి.. క్యూట్ లుక్స్‌తో

## అమికా శైల్ మెస్మరైజ్

**ఇయ్యాల్టి న్యూస్, సిన్మా, జూన్ 4:**
ప్రముఖ గాయని అమికా శైల్‌కు తెలుగులో పెద్దగా గుర్తింపు లేకపోయినా, హిందీ సినీ పరిశ్రమలో మాత్రం మంచి క్రేజ్ ఉంది. గాయనిగా తన కెరీర్‌ను ప్రారంభించిన ఈ బ్యూటీ, అనంతరం



హిందీ సినిమాలు, వెబ్ సిరీస్‌లలో నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అంతేకాకుండా పలు టెలివిజన్ కార్యక్రమాల్లో పాల్గొని తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అమికా చిన్న వయసులోనే సంగీతంపై ఆసక్తి పెంచుకొని అదే దిశగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది.ప్రస్తుతం బాలీవుడ్‌లో వరుస అవకాశాలను అందుకుంటూ కెరీర్‌ను విజయవంతంగా కొనసాగిస్తోంది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే అమికా శైల్ అప్పుడప్పుడు తన గ్లామరస్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది.

## వీధి కుక్క కోసం 'డిజిటల్' యుద్ధం...

## బ్రెజిల్ వర్సెస్ మెక్సికో

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:**
సాధారణంగా దేశాల మధ్య సరిహద్దుల కోసమో, రాజకీయాల కోసమో గొడవలు జరగడం చూస్తుంటాం. కానీ ప్రస్తుతం ఒక వీధి కుక్క జాతి కోసం బ్రెజిల్, మెక్సికో దేశాల మధ్య సోషల్ మీడియా వేదికగా పెద్ద యుద్ధమే నడుస్తోంది. ముదురు గోధుమ రంగులో ఉండే 'కారామెల్ డాగ్' అనే శునక జాతి తమదంటే తమదని ఈ రెండు లాటిన్ అమెరికా దేశాలు పోటీ పడుతున్నాయి. దాదాపు 300 రకాల కుక్కల జాతులు సమ్మేళనంతో పుట్టిన ఈ కారామెల్ కుక్క బ్రెజిల్ సంస్కృతి, ఆత్మగౌరవానికి ప్రతీక. అక్కడి ప్రతి వీధిలోనూ ఇవి కనిపిస్తాయి. గతంలో ఈ కుక్క బ్రెజిల్ కరెన్సీ నోట్లపై ముద్రించాలని ఏకంగా 50 వేల మంది ఆన్‌లైన్ పిటిషన్ కూడా వేశారు. ఇటీవల మెక్సికో ప్రభుత్వ పర్యావరణ సంస్థ ఈ కారామెల్ శునకాన్ని తమ దేశ సంస్కృతిలో భాగమని ప్రకటించింది, దాన్ని మెక్సికో 4వ జాతీయ చిహ్నంగా అధికారికంగా గుర్తించింది. కాగా...మెక్సికో తీసుకున్న ఈ నిర్ణయంపై బ్రెజిల్ పౌరులు తీవ్రంగా మండిపడుతున్నారు. "మా సంస్కృతి దేశని, మా వీధి కుక్కను దొంగిలిస్తారా?" అంటూ సోషల్ మీడియాలో మెక్సికో ప్రభుత్వానికి వ్యతిరేకంగా డిజిటల్ యుద్ధం మొదలైంది. ఒక సాధారణ వీధి కుక్క ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో రెండు దేశాల మధ్య సాంస్కృతిక వివాదానికి కేంద్రబిందువుగా మారింది.



## లవర్ తో రెడ్ హ్యాండెడ్‌గా రూంలో దొరికిన భార్య..

## పాపం...భర్త ఆవేదన చూస్తే ఏడ్వాల్సిందే...

**ఇయ్యాల్టి న్యూస్, వెబ్ డెస్క్, జూన్ 4:**
తమిళనాడులో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. అర్ధరాత్రి ఓ మహిళ తన భర్తకు ప్రియుడితో రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయింది. దీంతో తాను తన కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నా అంటూ భర్త సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. రాజా ఆత్విక్ దేవ్ అనే వ్యక్తి ఈ వీడియోలను షేర్ చేయగా ఇన్ స్టా, ట్విట్టర్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. వీడి యోల్లో మహిళ ఓ గదిలో తన ప్రియుడితో ఉండగా అదే సమయానికి భర్త ఎంట్రీ ఇచ్చాడు. భర్త రాగానే మహిళ బయటకు వచ్చినట్టు కనిపిస్తుంది. దీంతో భర్త వీడియో తీస్తూ లోపల ఎవరు ఉన్నారు.. అని ప్రశ్నించగా ఎవరూ లేరు.. అంటూ సమాధానం ఇస్తోంది.



అంతేకాకుండా ఎందుకు అరుస్తున్నావ్ అంటూ అతడిపైనే ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ డ్రెస్ ఏంటి.. అసలు నువ్వు ఏం చేస్తున్నావ్ అంటూ భార్యను నిలదీసిన భర్త చివరికి ఆమెపై చేయిచేసుకున్నాడు. చివరికి గదిలో నుండి ఆమె ప్రియుడు బయటకు వచ్చాడు. ఇక ఇది జరిగిన తరవాత భర్త తను కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నానని మరో వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తాను తన భార్యను ఎంతగానో ప్రేమిం చానని కానీ ఇలా మోసం చేస్తుం దని అనుకోలేదని చెప్పాడు. అతడికి చేతులకు దుస్తులకు రక్తం మరకలు కనిపిస్తుండగా, తాను తన కుమారుడితో కలిసి ఆత్మహత్య చేసుకుంటున్నా అంటూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ వీడియో సైతం వైరల్ అవ్వడంతో నెటిజన్లు అతడిని రక్షించాలి అంటూ పోలీసులను ట్యాగ్ చేస్తున్నారు. భర్తను మోసం చేసిన ఆ మహిళను కఠినంగా శిక్షించాలి అంటూ డిమాండ్ చేస్తున్నారు. రాజా ఆత్విక్ దేవ్ ఇన్ స్టాలో తన భార్యతో కలిసి ఎంతో ప్రేమగా దిగిన ఇతర ఫోటోలు, వీడియోలు సైతం ఉన్నాయి. అవి చూసిన నెటిజన్లు ఇంతమంచివాడిని ఎలా మోసం చేశావంటూ ఆమెపై మండిపడుతున్నారు.

ON BEHALFOF RRR MEDIA PRIVATE LIMITED. 2-3-603/49A, PATELNAGAR, AMBERPET, HYDERABAD.TELNGANA 500013..
EDITOR:RAMAN RAJU RATHNA.RNI NO:TG/2024/1093, Email:ramannews9@gmail.com Phone:9949152838,7013794396